సాక్షి వరంగల్

మంగళవారం | 27 | ఫిబ్రవరి | 2024



రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభం
అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు.
- 8లో▸



గృహజ్యోతి అమలుకు సన్నద్ధం
గృహజ్యోతి పథకం అమలుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ సన్నద్ధమవుతోంది. మార్చి మాసం నుంచి తెల్ల రేషన్‌కార్డు వినియోగదారులకు ఉచిత బిల్లును జారీ చేయనుంది.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$34^0 / 22^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత ఉంటుంది. రాత్రివేళ కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇప్పల్‌తండాలో చోరీ

- రూ.2.75లక్షల నగదు, బంగారు ఆభరణాల అపహరణ



నర్సంపేట రూరల్: నగదు, బంగారు ఆభరణాలు చోరీ గురైన సంఘటన మండలంలోని ఇప్పల్‌తండాలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం... ఇప్పల్ తండాకు చెందిన అంగోతు ఈరు కుటుంబ సమేతంగా ఈ నెల 23న హైదరాబాద్‌లోని తన చెల్లెలు ఇంటికి వెళ్లారు. ఈ నెల 25న రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని నగదు రూ. 2.75లక్షలు, 4 తులాల బంగారం, 40 తులాల వెండి పట్టీలు అపహరణకు గురయ్యాయి. సోమవారం పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ రమణమూర్తి, ఎస్సై శీలం రవి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు క్లూస్ టీంతో పరిసరాలను పరిశీలించారు. బాధితుడి అంగోతు ఈరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి



పర్వతగిరి: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఇన్ఫోర్ ప్రతినిధులు ఫ్రాంక్, రూడ్, రంగాలు అన్నారు. ఈ మేరకు మండలంలోని రోళ్లకల్ పాఠశాలను ఇన్ఫోర్ నుంచి వివిధ దేశాలకు సంబంధించిన ప్రతినిధులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల ఇన్ఫోర్ నిధులతో నిర్మించిన డయాస్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. అదనపు తరగతి గదుల కోసం నిధులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాల ప్రతినిధులు, ఆర్‌డీఎఫ్ సెక్రటరీ కిరణ్ అడ్డాల, ప్రధానోపాధ్యాయుడు బాషబోయిన రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



రాయపర్తి: మండలంలోని సన్నూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు వేంకటేశ్వరస్వామిని పురవీధుల్లో అశ్వవాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా అశ్వవాహన సేవ, పార్వేట, గ్రామోత్సవం, గజ వాహన సేవ, దోపు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ధర్మకర్తలు, అభివృద్ధి కమిటీ సభ్యులు సౌకర్యాలను కల్పించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ప్రధానార్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



సంగెం: వ్యవసాయ బావి వద్ద బట్టలు ఉతుకుతుండగా ప్రమాదశాత్తు విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బీకోజీనాయక్ తండా శివారు తూర్పు తండాకు చెందిన బానోత్ నాజీ (55) అనే మహిళకు కుమారుడు, కుమార్తె జన్మించిన తర్వాత భర్త నాగ్య మృతి చెందాడు. అప్పటి నుంచి పిల్లలను పెంచి పెద్ద చేసి పెళ్లిళ్లు చేసింది. కుమారుడు భద్రు వద్దనే నాజీ ఉంటుంది. సోమవారం బట్టలు ఉతికేందుకు ఇంటి పక్కన ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. మోటార్ నడుస్తున్న క్రమంలో దుప్పటి పైకిలేపి ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ పోల్ నుంచి స్టాటర్ వద్దకు ఉన్న సర్వీస్ వైర్‌కు దుప్పటి తగిలి సర్వీస్ వైర్ జాయింట్ తెగిపోయి నాజీ ఎడమ చేతి మణికట్టు, చాతి భాగంలో తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. ఇది గమనించిన స్థానికుడు భూక్య రాజు అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి విద్యుత్ అధికారులకు సమాచారం అందించి సరఫరా నిలిపివేయించారు. అనంతరం నాజీని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సీతారాములు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు మోక్షం!

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంతో దరఖాస్తుదారుల్లో సంతోషం

- మూడున్నరేళ్ల నిరీక్షణకు తెర
- గ్రేటర్ వరంగల్‌లో లక్షకుపైగా దరఖాస్తులు
- నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల మున్సిపాలిటీల నుంచి 9,120..
- దరఖాస్తులు పరిష్కరిస్తే రూ.220కోట్ల ఆదాయం



ఎక్కడెక్కడ ఎన్ని దరఖాస్తులంటే..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్	:	92,000
నర్సంపేట మున్సిపాలిటీ	:	5,376
వర్ధన్నపేట మున్సిపాలిటీ	:	526
పరకాల మున్సిపాలిటీ-	:	3,218

సాక్షి, వరంగల్: పెండింగ్‌లో ఉన్న లే అవుట్ రెగ్యులేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులకు మోక్షం లభించనుంది. దరఖాస్తులను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గ్రేటర్ వరంగల్ నగర వాసులతో పాటు నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల వాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మూడున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న దాదాపు లక్షకు పైగా దరఖాస్తుదారులకు సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం తీసుకున్న నిర్ణయం ఫుల్ జోష్ నిచ్చింది. వీటిలో 70,000లకు పైగా దరఖాస్తులు పరిష్కారమవుతాయని అనుకుంటున్న అధికారులు ఫీజుల రూపంలో దాదాపు రూ.220 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 92,000కుపైగా దరఖాస్తుదారుల నుంచి రూ.200 కోట్లు, నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల మున్సిపాలిటీల నుంచి వచ్చిన 9,120 దరఖాస్తుల ద్వారా రూ.20 కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ లెక్కన వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి కార్పొరేషన్, మున్సిపాలిటీల నుంచి రూ.220 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ కానుందని అధికారులు లెక్కలు వేస్తున్నారు. నగర, పురపాలికలు, పంచాయతీల పరిధిలోని అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించాలని 2020లో గత ప్రభుత్వం దరఖాస్తులు తీసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొన్ని కారణాలతో దరఖాస్తుల అంశం మరుగునపడింది. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మార్చి 31లోపు అన్ని దరఖాస్తులను పరిశీలించి ఆమోదం కాగానే ఫీజులు చెల్లిస్తే ఫైనల్ ప్రొసిడింగ్స్ ఇవ్వనున్నారు.

ఇక రంగంలోకి ప్రత్యేక బృందాలు..

ఇప్పటికే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)కు 2020లో వచ్చిన 92,000లకు పైగా దరఖాస్తుల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్లు ఆయా ప్లాట్ల విస్తీర్ణం కొలవడంతో పాటు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరగా పరిశీలించి క్లియర్ చేసి ఫీజులు కట్టినవారికి ఫైనల్ ప్రొసిడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించడంతో ఇప్పుడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగనున్నాయి. గతంలో మాదిరిగానే బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు బృందాలుగా ఏర్పడి ఆయా దరఖాస్తుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదించనున్నారు. దేవాదాయ, వక్ఫ్, కోర్టు ఆదేశాలు ఉన్న భూములు, ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లోని ప్లాట్లను తిరస్కరించనున్నారు. ఈ తరహా దరఖాస్తులు వేలల్లోనే ఉండొచ్చని అధికారులు అంటున్నారు. దరఖాస్తు ఫీజు రూ.వెయ్యి కావడంతో చాలామంది ప్లాట్ల యజమానులు అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ తరహావి 10వేలకుపైగానే ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తే 92,000లకు పైగా దరఖాస్తుల్లో క్లియర్ అయ్యేవి 62,000 మాత్రమే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇండస్ట్రీయల్ జోన్, పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్, రిక్రియేషనల్ జోన్, ట్రాన్స్‌పోర్టేషన్ జోన్, అగ్రికల్చర్ జోన్, హెరిటేజ్ కన్జర్వేషన్ జోన్ నివాసాలను అనుమతించరు. అందుకే ఈ జోన్లలో మరో పదివేల వరకు దరఖాస్తులు ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అలాగే నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల మున్సిపాలిటీలోని 9,120 దరఖాస్తుల్లో 8,000 వరకు పరిష్కరించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధ్యమైనంత తొందరగా క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తులను క్లియర్ చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్లనున్నారు.

వినతులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రావీణ్య



వినతిపత్రం పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన వినతులు వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజలు ఇచ్చే దరఖాస్తులు, వినతులు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, డీపీఓ కల్పన, డీఈఓ వాసంతి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా ప్రజావాణిలో 60 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అధికారులపై చర్య తీసుకోవాలి..



గ్రామాల్లో వేసిన సీసీ రోడ్ల పనులు నాసిరకంగా చేపట్టడంతో పగుళ్లు ఏర్పడ్డాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ పనులు సక్రమంగా చేపట్టలేదు. అధికారులు స్పందించి రోడ్లన్నీ పరిశీలించి కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి.

– వలందాస్ కుమార్, వడ్లకొండ, పర్వతగిరి

పట్టా పుస్తకం ఇప్పించాలి..



నా పది గుంటల భూమి పహాణిలో వస్తున్నా.. పట్టా పుస్తకంలో లేదు. దీంతో పక్కనున్న భూమి వారితో గొడవ జరుగుతుంది. తహసీల్దార్ కార్యాలయంలో విన్నవించుకున్న ఫలితం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలి.

– సంతూరి సత్యనారాయణ, వర్ధన్నపేట

కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు

కేయూ క్యాంపస్: కేయూలోని వివిధ విభాగాలు, వర్సిటీ కళాశాలల్లో పనిచేస్తున్న దినసరివేతన ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చారు. విద్యార్హతల్ని బట్టి దినసరివేతన ఉద్యోగులను మూడు విభాగాలుగా మార్చారు. కాంట్రాక్టు సీనియర్ అసిస్టెంట్‌లుగా, కాంట్రాక్టు జూనియర్ అసిస్టెంట్‌లుగా, డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా వారిహోదాను మారుస్తూ, పెంచిన వేతనాల అమలు ఉత్తర్వులను సోమవారం సంబంధిత అధికారులు జారీచేశారు. ఏవిభాగంలో పని చేసేవారికి ఆవిభాగం డ్రాయింగ్ ఆఫీసర్ ఆయా ఉద్యోగులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఉదాహరణకు.. కేయూ దూర విద్యాకేంద్రంలో పని చేస్తున్న ఆయా ఉద్యోగులకు దూర విద్యాకేంద్రం డైరెక్టర్ రాంచంద్రం ఆయా దినసరివేతన ఉద్యోగులకు కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చడంతోపాటు పెంచిన వేతనాల ఉత్తర్వులు కూడా అందజేశారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ నర్సింహారావు, గత కొన్నేళ్లుగా ఆందోళనలు చేసి నిరీక్షించినప్పటికీ ఎట్టకేలకు ఆయా ఉత్తర్వులు అందటంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీస్ అధికారుల బదిలీ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో ఈ.శ్రీనివాస్ దుగ్గొండి సర్కిల్ నుంచి పర్వతగిరి సర్కిల్, బి.రాజగోపాల్ పర్వతగిరి సర్కిల్ నుంచి దుగ్గొండి సర్కిల్, ఎ.మహేందర్ ఎస్‌బీ నుంచి ధర్మసాగర్, డి.విశ్వేశ్వర్ ధర్మసాగర్ నుంచి పీసీఆర్‌కు బదిలీ అయ్యారు.

సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో..

సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో జి.వెంకన్న మిల్స్ కాలనీ నుంచి పర్వతగిరి ఈ.వీరభద్రరావు పర్వతగిరి నుంచి కమలాపూర్ మునావత్ రమేశ్ పరకాల నుంచి కమలాపూర్, ఎల్.నరేశ్ వీఆర్ వరంగల్ నుంచి సంగెం, ఎం.భరత్ సంగెం నుంచి జనగామ, ఈ.నరసింహారావు టాస్క్‌ఫోర్స్ నుంచి జనగామ, బి.రామారావు హనుమకొండ నుంచి వీఆర్ వరంగల్, బండారి రాజు ధర్మసాగర్ నుంచి వీఆర్ వరంగల్,ఆర్.రామారావు కాజీపేట నుంచి నర్సంపేట, వి.రాజేందర్ సీసీఎస్ నుంచి వీఆర్ వరంగల్, కె.సంపత్‌కుమార్ సీసీఎస్ నుంచి వీఆర్ వరంగల్, ఎస్.బాపురావు సీసీఎస్ నుంచి వీఆర్ వరంగల్,కె.విద్యాసాగర్ షీటీం నుంచి వీఆర్ వరంగల్, ఎం.రాజు సీసీఎస్ నుంచి వీఆర్ వరంగల్‌కు బదిలీ చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేశారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కరీమాబాద్: ప్రతిఒక్కరు తమ ఆదాయంలో కొంత మొత్తం పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆర్‌బీఐ అక్షరాస్యత వారోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంకు ప్రతీ సంవత్సరం ఫిబ్రవరిలో ప్రత్యేక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. భవిష్యత్ ప్రణాళికలో ఆర్థిక అక్షరాస్యత కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజ్, డీఆర్‌డీఏ పీడీ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంలకు ఎఫ్‌ఎల్‌సీ పూర్తి

వరంగల్: ఈసీఐఎల్ సంస్థ నుంచి జిల్లాకు అదనంగా వచ్చిన 50 ఈవీఎంలకు సోమవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్లతో మొదటి దశ చెకింగ్ (ఎఫ్‌ఎల్‌సీ) నిర్వహించినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అధికారులు, సిబ్బందికి ఈవీఎంలపై శిక్షణ నిమిత్తం జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయానికి, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు 10 ఈవీఎంల చొప్పున 40 ఈవీఎంలను కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వ నారాయణ, డీటీ రంజిత్, కాంగ్రెస్, బీఎస్పీ, వైఎస్సార్‌సీపీ, ఎంఐఎం, టీడీపీ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజేష్, సాగర్, రజినీకాంత్, లక్ష్మణ్, ఫైజుద్దీన్, ఈసీఐఎల్ ఇంజనీర్స్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సరిత

నర్సంపేట రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మండలంలోని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు రుణాలు అందించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తయారు చేయడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కందగట్ల సరిత అన్నారు. నర్సంపేట మండల కేంద్రంలోని ఆదర్శ సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ మహిళా సంఘంలోని ప్రతీ సభ్యురాలికి రూ.5 లక్షల వరకు బ్యాంక్ రుణాలను వడ్డీ లేకుండా అందించి వారి వృత్తిలో తగిన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకునే రుణాలు ఒకే రకమైన వ్యాపారంపై పెట్టుబడి పెట్టకుండా వివిధ రకాల ఆదాయాభివృద్ధి కార్యక్రమాల (వ్యాపారాల)పై పెట్టుబడి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బ్యాంక్ లింకేజీ వోసుకుల ప్రేమ్‌రాజ్, ఏపీఎంలు మహేందర్, ప్రేమ్‌రాజ్, సీసీలు, వీఓఏలు, మండల సమాఖ్య పాలక వర్గం అధ్యక్షురాలు వీణ, కార్యదర్శి శ్వేత, కోశాధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: కేయూలో ఈనెల 27, 28 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సెమినార్ డైరెక్టర్ ఆచార్య కె.రాజేందర్ సోమవారం తెలిపారు. కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల, ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ సంయుక్తంగా ఈసదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 'లీవరేజింగ్ సస్టెయినబుల్ ఫైనాన్స్ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఎమర్జింగ్ చాలెంజెస్ అండ్ సొల్యూషన్స్' అంశంపై ఈసదస్సు కొనసాగుతుందని పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

సమన్వయలోపం ఎక్కడ జరిగింది..?

మేడారంలో వైఫల్యాలపై నివేదిక కోరిన ప్రభుత్వం

- నివేదిక రాగానే ఉన్నత స్థాయి సమీక్ష?
- కొందరు పోలీసు ఉన్నతాధికారుల తీరుపైనే విమర్శలు
- ఉన్నతస్థాయి కమిటీ వేసినా.. ఎవరికీ వారే యమునా తీరే..
- విచ్చలవిడిగా వీఐపీ, వీవీఐపీ పాసుల జారీ
- చుక్కలు చూసిన సామాన్యులు
- సత్ఫలితాలు ఇవ్వని ముందస్తు కో–ఆర్డినేషన్ మీటింగ్‌లు
- జాతరలో వైఫల్యంపై సర్వత్రా చర్చ



తొక్కిసలాటలో కిందపడ్డ భక్తురాలు (ఫైల్)



నీటికోసం బోరువద్ద ఎగబడుతున్న జనం (ఫైల్)

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ కుంభమేళా, మేడారం జాతరలో అసౌకర్యాలను భక్తులు ఇంకా మరిచిపోవడం లేదు.ఈసారి జాతర కొందరు ఉన్నతాధికారులకు పిక్నిక్ స్పాట్‌గా మారిందే తప్ప.. భక్తులకు ఏ మాత్రం ప్రాధాన్యం దక్కలేదన్న చర్చ జరుగుతోంది. 'వందల కిలోమీటర్ల దూరం నుంచి వనదేవతలను దర్శించుకునేందుకు వచ్చాం.. ఇక్కడి పరిస్థితి చూస్తే మరోసారి మేడారం రావాలనే ఆలోచన కలగకుండా చేశారు' అని భక్తులు తమ అసహనాన్ని వ్యక్తం చేశారంటే అర్థం చేసుకోవచ్చు. గత జాతరకు 1.35 కోట్ల మంది వస్తే ఈసారి 1.45 కోట్ల మంది భక్తులు వచ్చారు. అంటే గతం కంటే 10 లక్షల మందికి పైగా భక్తులు అదనంగా హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. 2022 జాతర ఏర్పాట్ల కోసం అప్పటి ప్రభుత్వం రూ.75 కోట్లు మంజూరు చేస్తే.. ఈసారి రూ.110 కోట్లు కేటాయించారు. కానీ ఆ మేరకు సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అష్టకష్టాలు ఎదురయ్యాయి. 'లేవు లేవంటూనే.. వేల సంఖ్యలో వీఐపీ, వీవీఐపీ పాసులు జారీ చేశారు.. ఆటోలు, జీపులకు కూడా వీవీఐపీ పాసులు అంటించుకుని వచ్చారు.. ఇగ బస్సుల్లో వచ్చిన మేం గంటల కొద్ది లైన్లలో నిలబడి దర్శనం చేసుకోవాల్సి వచ్చింది' అని జాతర చేదు అనుభవాలను భక్తులు సోషల్ మీడియా ద్వారా ఇంకా షేర్ చేసుకుంటుండడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో మేడారం మహా జాతర నిర్వహణ, కొందరు పోలీసు ఉన్నతాధికారుల తీరుపై ప్రభుత్వం నివేదిక కోరినట్లు తెలిసింది. నివేదిక అందిన తర్వాత ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు అధికారవర్గాల సమాచారం.

ఎవరికి వారే యమునా తీరే...

జాతర నిర్వహణ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లుగా కనిపించింది. సమన్వయం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్‌లు ఆర్వీ కర్ణన్, కృష్ణ ఆదిత్య, ఆదర్శ్ సురభి, ప్రతిమా సింగ్, రాధికా గుప్తాను నియమించినప్పటికీ.. అప్పటికే పూర్తయిన ఏర్పాట్లు, అధికారుల డ్యూటీల కేటాయింపుల కారణంగా వారు ఎక్కువ జోక్యం చేసుకునే అవకాశం లేకుండా పోయింది. జాతర నిర్వహణ అనుభవం లేనప్పటికీ అక్కడి కలెక్టర్, ఎస్పీలే కీలకంగా వ్యవహరించడం వల్ల ప్రత్యేక అధికారుల పాత్ర నామమాత్రమే అయ్యింది. వీఐపీల రాకపోకలు, ప్రొటోకాల్‌పై ప్రత్యేక దృష్టి సారించిన ఉన్నతాధికారులు జాతర ప్రక్రియ, భక్తుల దర్శనాల్లో ఇబ్బందులను అంతగా పట్టించుకోలేకపోయారన్న విమర్శలు తలెత్తాయి. గతంలో పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారులను ఈసారి ఎక్కువ మందిని వినియోగించుకోకపోవడం.. కొంతమందికి డ్యూటీలు వేసినా పరిమిత అధికారాలే ఇచ్చారు. స్థానిక కలెక్టర్, ఎస్పీలు ములుగు జిల్లాలో బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే మహాజాతర రావడం... సీనియర్లుగా ఉన్న ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులను సమన్వయం చేసేందుకు ప్రయత్నాలు అంతగా పారలేదు.

జాతర లోపాలను గుర్తించి సమీక్షిస్తేనే..

జాతరకు వచ్చిన భక్తులు, విధుల్లో ఉన్న సిబ్బంది సైతం ఇబ్బంది పడ్డారన్నది వాస్తవం. 23న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవార్లను దర్శనం చేసుకుని వెళ్లిన తర్వాత పోలీసులు పూర్తిగా చేతులెత్తేశారు. ఫలితంగా జాతరకు అనుసంధానమైన ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది. తాడ్వాయి -పస్రా రూట్‌లో సుమారు 14 కిలోమీటర్ల వరకు వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. మేడారం ఆర్టీసీ పాయింట్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బస్సుల్లో బయల్దేరిన వారు తాడ్వాయి దాటి పస్రా చేరుకోవడానికి రాత్రి 12 అయ్యింది. దాదాపు 12 గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుని జనం అవస్థలు పడ్డారు. కొంత రద్దీ తగ్గినప్పటికీ 24వ తేదీ సాయంత్రం వరకు ప్రధా న రహదారులపై ట్రాఫిక్ జామ్ కొనసాగింది. వీటికి కారణాలపై సమీక్ష జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఈసారి కొందరు అంతా తామే అన్నచందంగా వ్యవహరించడంతోనే జాతర నిర్వహణలో అడ్మినిస్ట్రేషన్ ఫెయిల్ అయ్యిందన్న చర్చ జరుగుతోంది. వీటిపై ప్రభుత్వం స్పందించి సమీక్షిస్తేనే వచ్చేజాతరలో ఇలాంటి లోపాలు జరగవనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

వీఐపీల సేవలో తరించిన అధికారులు..

వీవీఐపీల సేవలోనే తరించిన అధికారులు భక్తుల ఇబ్బందులను పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇళ్లనుంచి జాతరకు... తిరిగి ఇంటికి చేరే వరకు భక్తజనానికి తాగు నీరు, రవాణా, ట్రాఫిక్, దేవతల దర్శనం, పారిశుద్ధ్యం, పార్కింగ్‌లు.. ఇలా అడుగడుగునా ఇబ్బందులు ఎదురయ్యాయి. దర్శనం తోపులాటలు, గద్దెల వద్ద పలువురికి గాయాలు సైతం అయ్యాయి. ప్రధానంగా కొందరు పోలీస్ అధికారుల మితిమీరిన జోక్యం, అసమర్థత కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై భక్తులు విమర్శలు చేసే పరిస్థితి ఏర్పడింది. అర్థంపర్థం లేని ఆంక్షలు, శాఖల అధికారుల మధ్య సమన్వయలోపం, ట్రెయినీ ఐపీఎస్ అధికారుల దురుసుతనం, ప్రొటోకాల్‌కే పరిమితమైన కలెక్టర్, ఎస్పీలు.. అంతకు ముందు జాతరలో పనిచేసిన అనుభవం లేని ఉన్నతాధికారులకు బాధ్యతలు ఇవ్వడం కారణంగా జాతర మొత్తంగా భక్తులు చుక్కలు చూశారు.

ఈ-పాస్‌తోనే ఎరువులు విక్రయించాలి



ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న డీఏఓ

సంగెం: రైతులకు విక్రయించే ఎరువులను ఈ–పాస్ యంత్రాల ద్వారానే విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కాపులకనిపర్తి, గవిచర్ల, తిమ్మాపూర్, మొండ్రాయి, బీకోజీనాయక్ తండాల్లోని పీఏసీఎస్, ఓడీసీఎంఎస్, ప్రైవేట్ ఎరువుల దుకాణాలను సందర్శించి ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం ద్వారా తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఆధార్‌కార్డు లేకుండా, ఈపాస్‌లో నమోదు చేయకుండా ఎరువులు విక్రయించవద్దని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యాకయ్య, ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం కన్సల్టెంట్ సారంగం, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాన్ మృతి


శ్రీనివాస్(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్‌హవేలి- సంగెం రహదారిలో మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఆర్మీ జవాన్ మృతి చెందాడు. జవాన్ బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్మీజవాన్‌గా విధులు నిర్వహిస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపనికుంట గ్రామానికి చెందిన చల్ల శ్రీనివాస్(32) తన భార్య భవానీతో కలిసి ఆదివారం సంగెం మండలం చింతలపల్లి గ్రామంలోని తన భార్య మేనమామ చింతల రాజు ఇంటికి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 6గంటల సమయంలో ఊకల్‌హవేలి శివారులోని మూల మలుపు వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోగా ఫెన్సింగ్ కోసం పాతిన రాయికి శ్రీనివాస్ బలంగా ఢీకొన్నాడు. దీంతో శ్రీనివాస్ తల, ఛాతీలో తీవ్ర గాయాలు కాగా భార్యకు కుడి చేయి, ముఖం, ఛాతీలో గాయాలయ్యాయి. ఇరువురినీ 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. అదే రోజు రాత్రి 8.30గంటలకు శ్రీనివాస్ మృతి చెందగా అతడి భార్య చికిత్స పొందుతోంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం మృతుడి అన్న కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ బాబూలాల్ తెలిపారు.

సంపూర్ణ మద్దతు ఇవ్వాలి

● బీజేపీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మురళీధర్ గౌడ్



హన్మకొండ: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు తెలుపాలని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్ కోరారు. సోమవారం హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విజయ సంకల్ప యాత్ర వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మురళీధర్ గౌడ్ మాట్లాడారు. బీజేపీ నాయకులు ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడారు. కాకతీయ- భద్రకాళి క్లస్టర్ యాత్ర మార్చి 1న వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రవేశిస్తుందని తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు హనుమకొండ వెయ్యి స్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హనుమకొండ చౌరస్తాలో ఉదయం 10:30 గంటలకు కార్నర్ మీటింగ్ ఉంటుందన్నారు. మీటింగ్ అనంతరం పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి కాజీపేట వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ కందగట్ల సత్యనారాయణ, రావుల కిషన్, సదానందం గౌడ్, ప్రవీణ్ రెడ్డి, దాస్యం అభినవ్ భాస్కర్, సుదర్శన్, బాబు పాల్గొన్నారు.

గృహజ్యోతి అమలుకు సన్నద్ధం



గృహాలకు 200 యూనిట్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం

● కొనసాగుతున్న తెల్ల రేషన్ కార్డు, ఆధార్ నంబర్ల అనుసంధానం

● మార్చి నెలతో ఉచితం బిల్లు జారీ

హన్మకొండ: గృహజ్యోతి పథకం అమలుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ సన్నద్ధమవుతోంది. మార్చి మాసంతో తెల్ల రేషన్‌కార్డు వినియోగదారులకు ఉచితం బిల్లును జారీ చేయనుంది. ఆరు గ్యారంటీల్లో మరో రెండు గ్యారంటీలు త్వరలో అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇందులో గృహజ్యోతి పథకం ఒకటి. ఈ మేరకు విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆదేశాలు అందడంతో అధికారులు ఇప్పటికే తెల్లరేషన్ కార్డు కలిగిన గృహ విద్యుత్ వినియోగదారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు.

ఒక కార్డుకు ఒకటే సర్వీస్‌నంబర్..

ఒక తెల్లరేషన్‌కార్డుకు ఒక సర్వీస్ నంబర్‌కు మాత్రమే ఉచిత విద్యుత్ వర్తిస్తుంది. అద్దెకు ఉన్న వారు తమ తెల్లరేషన్ కార్డును ప్రస్తుతం నివాసముంటున్న గృహ విద్యుత్ సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేయించాల్సి ఉంటుంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని ఉండాలనే నిబంధన గతంలో ఉండేది.. వీరికి ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. వారు ఇప్పటికైనా తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గృహజ్యోతి పథకం కోసం ప్రజాపాలన దరఖాస్తు అందించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు సర్వీస్‌నంబర్‌తో తెల్ల రేషన్‌కార్డు వినియోగదారుడు అనుసంధానం చేయించకపోయినా... ఆ తర్వాత అనుసంధానం చేసినా మార్చి నుంచి ఆ లబ్ధిదారుడికి ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుంది. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్న వినియోగదారునికి మార్చి నెలలో ఉచితం బిల్లు జారీ చేయకున్నా... ఆ తరువాతి నెలలో సర్వీస్ నంబర్‌ను అనుసంధానించుకుంటే ఆ నెల బిల్లు కూడా చెల్లించాల్సిన అవసరం లేదని విద్యుత్ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి లబ్ధిదారులను గుర్తించే వరకు ఈ ప్రక్రియ నిరంతరాయంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. కాగా, లబ్ధిదారుల ఎంపిక ఆయా మండల తహసీల్దార్, ఎంపీడీఓలు చేసి జాబితాను ప్రభుత్వానికి పంపుతారని, ప్రభుత్వం ఆ జాబితాను విద్యుత్ పంపిణీ సంస్థలకు పంపగానే ఉచితం వర్తిస్తుందని ఎన్పీడీసీఎల్ అధికారులు వివరించారు. కాగా, 200 యూనిట్ల కంటే ఒక్క యూనిట్ పెరిగినా వారికి ఉచితం వర్తించదని, మొత్తం యూనిట్లకు డబ్బులు కట్టాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గృహ వినియోగదారులు
12,03,156
లబ్ధిదారుల గుర్తింపు (ఇప్పటివరకు)
3,75,683

ఫిబ్రవరి నెల బిల్లుల జారీ సమయంలో అనుసంధానం..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం గృహ వినియోగదారులు 12,03,156 మంది ఉండగా ఇప్పటి వరకు 3,75,683 మంది తెల్ల రేషన్‌కార్డు వినియోగదారులను గుర్తించారు. ఫిబ్రవరి మాసం బిల్లులు జారీ సందర్భంగా తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు నంబర్ తోపాటు ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌ను గృహ విద్యుత్ వినియోగదారుల సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేశారు. ఇంకా చాలామంది కనెక్షన్లు అనుసంధానం కాలేదు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు ఉన్నారు.

జిల్లాల వారీగా ఇప్పటివరకు తెల్లరేషన్ కార్డుదారుల గుర్తింపు

జిల్లా	గృహ వినియోగదారులు	గుర్తింపు
హనుమకొండ	3,45,302	82,465
వరంగల్	2,86,156	82,211
భూపాలపల్లి, ములుగు	1,93,257	68,135
జనగామ	1,69,375	70,116
మహబూబాబాద్	2,09,066	72,756

ఓరుగల్లుతో విడదీయలేని అనుబంధం

● త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి


ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న ఫోరం బాధ్యులు

కాజీపేట అర్బన్: ఓరుగల్లుతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి తెలిపారు. హనుమకొండలో సోమవారం ఓరుగల్లు సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ పౌర సన్మాన కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు. తన జీవితంలో ఎదుగుదలకు ఓరుగల్లు ముఖ్య భూమిక పోషించిందని తెలిపారు. త్రిపురను ప్రతి ఒక్కరు సందర్శించాలని ఆహ్వానం పలికారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సత్కరించారు. ఓరుగల్లు సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో కాకతీయ జ్ఞాపిక, శాలువా, గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండె విజయరామారావు, మాజీ ఎమ్మెల్యేలు శ్రీరాములు, ధర్మారావు, శ్రీధర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల బీజేపీ అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, రాజేశ్వర్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, విజయ్‌చందర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, నాగరాజు, రామచందర్ పాల్గొన్నారు.

సీనియర్ అడ్వకేట్‌ను నియమించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల కేసు పరిష్కారానికి సీనియర్ అడ్వకేట్‌ను నియమించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కేయూ అధ్యాపకుల సంఘం (అకుట్) జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఇస్తారి మాట్లాడారు. పలు విభాగాల్లో రొటేషన్ పద్ధతిలో అధిపతులను నియమించాలన్నారు. లా కాలేజీకి చెందిన సుదర్శన్‌కు పీహెచ్‌డీ గైడ్ షిప్ ఇవ్వాలన్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్‌కు కమిటీలని రెన్యూవల్ చేయాలని కోరారు. బ్రహ్మేశ్వరీ, డాక్టర్ రమేష్, రమ, శాయేదా, మమత, మంజుల, భారవి శర్మ, శ్రీనివాస్, వెంకటయ్య పాల్గొన్నారు.

28న పగిడిద్దరాజు తిరుగువారం పండుగ


కరపత్రాలను అందజేస్తున్న కమిటీ బాధ్యులు

గంగారం : మానుకోట జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్ల గ్రామంలో సమ్మక్క భర్త అయిన పగిడిద్దరాజు ఆలయంలో ఈనెల 28న నుంచి మార్చి 01 వరకు తిరుగువారం జాతర నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పూజారులు పెనక రాజేశ్వర్, పెనక వీరస్వామి సోమవారం తెలిపారు. జాతరకు రావాలని కోరుతూ.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణ రెడ్డికి కరపత్రాలను అందించారు.


హుండీని వాహనంలో ఎక్కిస్తున్న అధికారులు


హనుమకొండకు చేరిన హుండీ బస్సులు

మేడారం హుండీల తరలింపు

● జాతర ముగిసినా దర్శనానికి వస్తున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం మహాజాతర ముగియడంతో గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకల లెక్కింపు కోసం దేవాదాయశాఖ అధికారులు సోమవారం హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపానికి తరలించారు. సమ్మక్క హుండీలు 215, సారలమ్మ హుండీలు 215, పగిడిద్దరాజు హుండీలు 26, గోవిందరాజు హుండీలు 26 , క్లాత్ హుండీలు 30 కలిపి మొత్తం 512 హుండీలను ఏర్పాటు చేసినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. ఈనెల 28న బుధవారం మేడారంలో పూజారులు తిరుగువారం పండుగను నిర్వహించనున్నందున గురువారం నుంచి కానుకలను లెక్కించనున్నట్లు వెల్లడించారు. స్వచ్ఛంద సంస్థలు, దేవాదాయశాఖ సిబ్బంది కానుకలను లెక్కిస్తారని తెలిపారు. దేవాదాయ, రెవెన్యూ అధికారులు, పూజారులు, పోలీసుల పర్యవేక్షణలో లెక్కింపు ఉంటుందన్నారు.

జాతర ముగిసినా.. తగ్గని జనం

మహాజాతర ముగిసి రెండు రోజులు గడిచినా.. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలి వస్తున్నారు. భక్తుల రద్దీ తగ్గడంతో మంగళవారం అమ్మవార్ల గద్దెలపైకి భక్తులను అనుమతిచ్చారు. దీంతో భక్తులు ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. పారిశుద్ధ్య కార్మికులు గద్దెలపై పేరుకుపోయిన మిశ్రమాన్ని తొలగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. తిరుగువారం పండుగ నిర్వహణపై చర్చించేందుకు పూజారులు మంగళవారం సమావేశమయ్యారు.

ఆహారకల్తీ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలి


ఆహార కల్తీ పరీక్ష విధానాన్ని వివరిస్తున్న లక్ష్మీనారాయణ

హన్మకొండ: జిల్లా కేంద్రాల్లో ఆహార కల్తీ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హైదరాబాద్, నాచారంలోని మైక్రో బయాలజీ ఆహార కల్తీ పరీక్ష కేంద్రాన్ని వినియోగదారుల సంఘాల ప్రతినిధులు సందర్శించారు. మైక్రో బయాలజీ లాబొరేటరీ విశిష్టత, ఆహార కల్తీని ధృవీకరించే విధానాలను చీఫ్ పబ్లిక్ అనలిస్ట్ జి.లక్ష్మీనారాయణ వివరించారు. ఆహార కల్తీ వల్ల మోసపోయామని ఎలాంటి సందేహం కలిగినా రూ.200 రుసుం చెల్లించి పరీక్షలు చేయించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ.. వినియోగదారుల సంక్షేమం దృష్ట్యా ఆహార కల్తీ లాబొరేటరీలు రాష్ట్రంలోని హనుమకొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాలలో ఏర్పాటు చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న ఉత్పత్తులు కృత్రిమ రసాయనాలు వాడుతున్నారని, దీంతో ఇవి ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, క్యాట్కో చైర్మన్ శంకర్ లాల్ చౌరాసియా, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కాసు విశ్వేధర్ రాజు పాల్గొన్నారు.

కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల ధర్నా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కేయూ క్యాంపస్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం క్యాంపస్‌లోని పరిపాలనాభవనం వద్ద అధ్యాపకులు ధర్నా నిర్వహించారు. వివిధ విభాగాలు, వర్సిటీ కళాశాలల్లో 16 పీరియడ్ల వర్క్‌లోడును ఉన్న పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. మిగితా పార్ట్‌టైం అధ్యాపకులకు పీరియడ్‌కు రూ.700 నుంచి రూ.1,000కి రెమ్యూనరేషన్‌ను పెంచాలని ధర్నా కొనసాగించారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధర్నా ప్రదేశానికి వచ్చి సంఘీభావం తెలిపి, మాట్లాడారు. పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ధర్నాలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు డాక్టర్ చిర్రరాజు, డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ మామిడి లింగయ్య మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, డాక్టర్ దేవోజీ, తిరుణహరిశేషు, వినీత, సుధీర్, రమేష్, వీరేందర్, విజయ్‌కుమార్, చారి, శ్రీధర్, స్వామి, భిక్షపతి, శరణ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలి

● శ్రీబాలాజీ అగ్రిమాల్ ఎదుట రైతుల ఆందోళన, రాస్తారోకో

● వరి పొలాన్ని పరిశీలించిన ఏఓ


రాస్తారోకో చేస్తున్న రైతులు

మహబూబాబాద్ రూరల్: నకిలీ వరి విత్తనాలతో సాగు చేసి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని, నకిలీ విత్తనాలు అంట గట్టిన షాపు యజమానిపై చర్యలు తీసుకుని పరిహారం ఇప్పించాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీబాలాజీ అగ్రిమాల్ ఎదుట సోమవారం రైతులు ఆందోళన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత రైతు భూక్యా రాందాస్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని బాబునాయక్ తండాకు చెందిన 10మంది గిరిజన రైతులు శ్రీబాలాజీ అగ్రిమాల్ షాపులో ఆర్ఎన్ఆర్ 15048 వరి విత్తనాలను కొనుగోలు చేశారన్నారు. 30ఎకరాల్లో వరి సాగు చేయగా 120 రోజులకు కంకులు రావాల్సిఉండగా 50 రోజులకే పంట కంకులు వేసిందని తెలిపారు. పంట చేతికి అంది వచ్చే సమయానికి ముందు కంకులు వచ్చిన పంట నేలరాలిపోతుందన్నారు. పంట పెట్టుబడులతో ఎకరానికి రూ.60వేలు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. షాపు యజమానికి నకిలీ విత్తనాల విషయం తెలియచేయగా దిక్కున్నచోట చెప్పుకో, నన్ను ఏం చేయలేవని దురుసుగా సమాధానం ఇచ్చారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి నకిలీ విత్తనాలు విక్రయించిన వ్యాపారిపై చర్యతీసుకుని పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశాడు. విషయం తెలుసుకున్న టౌన్ ఎస్సై అరుణ రాస్తారోకో వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేస్తామన్నారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

పంట పరిశీలన

రైతుల ఫిర్యాదు మేరకు మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి వరి పంట సాగు చేసిన ప్రాంతాలను సోమవారం పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేసి వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా నిర్ధారణ చేయిస్తామని పేర్కొన్నారు. రైతులకు విత్తన నాణ్యతపై అనుమానాలు నివృత్తి చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రైతు వ్యతిరేక విధానాల్ని విడనాడాలి

● ఢిల్లీలో రైతుల పోరాటానికి మద్దతు

● సంయుక్త కిసాన్ మోర్చా రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న నాయకులు

హన్మకొండ: రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ఎం.చుక్కయ్య, ఎస్.హంసా రెడ్డి, బొట్ల చక్రపాణి, జి.రాములు డిమాండ్‌చేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సోమవారం హనుమకొండలోని కాళోజీ కూడలిలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతులపై అమానుషమైన దాడులు, దౌర్జన్యాలు, భాష్పవాయు గోళాలు ప్రయోగించి, తుపాకీ తూటాలని ఎక్కు పెట్టడంతో దారుణమన్నారు. ఇప్పటికే ఇద్దరు రైతులు చనిపోయారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వస్తే ఈ దేశంలో రైతుల హక్కులు ఉండవని, కార్మికులు, కర్షకులు, ఉపాధి హామీ కూలీలు నిరుద్యోగులుగా మారే ప్రమాదం ఉందన్నారు. దేశంలోని సమష్టి సంపద, సహజ వనరులు, ప్రభుత్వ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ కట్టబెడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులు తీసుకున్న అప్పులను మొండి బకాయిలుగా పేర్కొంటూ రూ.14లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని వివరించారు. నరేంద్ర మోదీ విధానాలను ప్రతిఘటించాలని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తేనే ప్రజాతంత్రపాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వాంకుడోతు వీరన్ననాయక్, గౌడుగు వెంకట్, కాడబోయిన లింగయ్య, దొగ్గెల తిరుపతి, బానునాయక్, వీ.ఎస్.రావు, గడ్డం నాగార్జున పాల్గొన్నారు.

సాహిత్యం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం

● కేయూ మాజీ వీసీ గోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న కేయూ మాజీ వీసీ గోపాల్‌రెడ్డి

కేయూ క్యాంపస్: తెలుగు సాహిత్యం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమని కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కేయూ తెలుగు విభాగం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో కేయూలోని పరిపాలనాభవనం సెనెట్‌హాల్‌లో యూనివర్సిటీ తెలుగు ఆచార్యుల సాహిత్యసేవ అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సు ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. తెలుగు విభాగం పూర్వ ఆచార్యులు ఎంతో క్రమశిక్షణ, నిబద్ధతను కలిగి ఉండి సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో రచనలు చేశారన్నారు. యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యుల పరిశోధనలు స్ఫూర్తిదాయకమని అన్నారు. విశ్రాంత ఆచార్యులు సుప్రసన్నాచార్య మాట్లాడుతూ.. సాహిత్యాన్ని కొత్తకోణంలో వీక్షించి సమాజ చైతన్యానికి దోహదపడాలన్నారు. అనంతరం కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కాత్యాయనీ విద్మహే కీలకోపన్యాసం చేశారు. అనంతరం ఈసదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడారు. తెలుగు యూనివర్సిటీ మాజీ వీసీ భూమయ్య, డాక్టర్ కిషన్‌ప్రసాద్, నర్సయ్య పాల్గొన్నారు. కేతవరపు రామకోటిశాస్త్రి, అమరేశం రాజేశ్వరశర్మ, కోవెల సుప్రసన్నాచార్య ,పేర్వారం జగన్నాథం కవిత్వాలు, విమర్శ, పరిశోధనలపై పలువురు పరిశోధనాపత్రాలు సమర్పించారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల ప్రారంభం

● వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ


కాజీపేట రూరల్: బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు


కాశిబుగ్గ: మాట్లాడుతున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్

కాశిబుగ్గ: అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. వరంగల్ రైల్వే స్టేషన్ నాలుగో ప్లాట్ ఫాంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్(ఏడీఆర్ఎం) రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండా ప్రకాష్ మాట్లాడుతూ.. వరంగల్ రైల్వే స్టేషన్ అమృత్ భారత్ పథకంలో ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. వరంగల్ నుంచి హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా పుష్‌పుల్ రైళ్లు నడిపించాలని రైల్వే అధికారులకు సూచించారు. ఎంపీ దయాకర్ మాట్లాడుతూ.. వరంగల్ చరిత్ర ప్రతిబింబించేలా రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ సుధారాణి, ఏడీఆర్ఎం రాజీవ్‌కుమార్ మాట్లాడారు. వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, గుండేటి నరేంద్రకుమార్, అనిల్, రవి, సురేష్ జోషి, కుమార్, నాయకులు ప్రదీప్‌రావు, విజయ్‌చందర్ రెడ్డి, కాశీప్రసాద్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, శ్రీనివాస్, స్టేషన్ మేనేజర్ బాలరాజు, రాజగోపాల్, కృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాజీపేట రూరల్: కాజీపేట-బల్లార్షా సెక్షన్‌లో వడ్డెపల్లి రైల్వే గేట్ స్థానంలో నిర్మించిన రోడ్ ఓవర్ బ్రిడ్జిని సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ప్రారంభించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ప్రధాని మోదీ వర్చువల్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ రైల్వే డిప్యూటీఈఈ మధుసాగర్, నాయకులు రావు పద్మ, అమరేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు సునిల్, దివ్యరాణి రాజు, నాయకులు మణిందర్, పూర్ణచందర్, రైల్వే డిప్యూటీ సీఈ సజ్జ భార్గవ్‌కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బద్దియా, సజ్జన్‌లాల్, రాజ్‌కుమార్, ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.

కాజీపేటలో ఆర్‌యూబీ ప్రారంభం

కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్ సమీపంలో నిర్మించిన రోడ్ అండర్ బ్రిడ్జిని ప్రధాని మోదీ వర్చువల్‌లో ప్రారంభించగా.. కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీరజాలి, నాగేశ్వర్‌రావు, రైల్వే సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్ పాల్గొన్నారు.